క్లుప్తంగా

పర్వతరెడ్డి నివాళి



కోవూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు ముదిరెడ్డి లక్ష్మిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తల్లి నారాయణమ్మ మృతి చెందడంతో శనివారం ఆమె భౌతికకాయానికి పడుగుపాడులో వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. నారాయణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకారంలో స్వామివారు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకం గావించారు. ప్రత్యేకాలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యువతరానికి ఆటలు అవసరం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నేటి యువతరానికి ఆటలు అవసరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాలలో ఆమె జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరమని పేర్కొన్నారు. అనంతకం కట్టుబడిపాళెంలో ఏర్పాటు చేసిన వాటర్‌పైపులైన్, అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం



కృష్ణయ్య(ఫైల్)

విడవలూరు: విడవలూరు గ్రామానికి చెందిన నాశిన కృష్ణయ్య (74) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మాదరస్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. ఐ టెక్నీషియన్లు నాగేశ్వరరావు, సదాశివరామ్‌లు మృతుడి నేత్రాలను సేకరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని బురాన్‌పూర్ సమీపంలో గల జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గూడూరు వైపు నుంచి నెల్లూరుకు బైక్‌పై కృష్ణమోహన్ బయల్దేరారు. ఈ క్రమంలో బురాన్‌పూర్ వద్ద ఓ మహిళ రోడ్డు దాటుతుండగా, ఆమెను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని నెల్లూరు తరలించారు.

డిపో-1 ఇన్‌చార్జి డీఎంగా సునీత

నెల్లూరు సిటీ: నెల్లూరు ఆర్టీసీ డిపో-1 ఇన్‌చార్జి డీఎంగా ఎం.సునీతను నియమించారు. ఇటీవల డీఎం-1గా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన స్థానంలో డిపో సీఐగా చేస్తున్న సునీతను నియమించారు.

పొమ్మనలేక పొగ..!

- హైస్కూల్ ప్లస్‌లో ఒక్కరే అధ్యాపకులు
- 65 మంది విద్యార్థినులు ఉన్నా.. పట్టించుకునే వారేరీ?
- ప్రైవేటు బారిన పడాల్సిందేనంటూ విద్యార్థినుల ఆవేదన

పొమ్మనలేక పొగ పెడుతున్నారనేందుకు కొడవలూరు మండలం నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్ అద్దం పడుతోంది. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టలేక 65 మంది విద్యార్థినులు ఇక్కడ ఇంటర్మీడియట్‌లో చేరారు. కళాశాల తెరిచి నెల దాటినా ఒక అధ్యాపకుడు మినహా ఎవరినీ నియమించలేదు. దీంతో కళాశాలలో చేరిన విద్యార్థినుల్లో ఆందోళన నెలకొంది. ఇదే కొనసాగితే తమ పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.



అధ్యాపకులు లేరని వాపోతున్న హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు

కొడవలూరు: గత ప్రభుత్వం పేద గ్రామీణ విద్యార్థులకు ఉచిత ఇంటర్ కళాశాలలు ఉండాలన్న ఉద్దేశంతో అన్ని మండలాల్లో హైస్కూల్‌కు అనుబంధంగా హైస్కూల్ ప్లస్ పేరుతో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టింది. అదే సమయంలో కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేకంగా బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌ను ఏర్పాటు చేసింది. ఆ సమయంలో అవసరమైన మేర అధ్యాపకులను కూడా నియమించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టారు. అందులో భాగంగా ఇక్కడ అధ్యాపకులుగా ఉన్న వారంతా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఒకే ఒక్క అధ్యాపకుడు మిగిలారు. అధ్యాపకులు బదిలీపై వెళ్లి నెల గడిచినా ఇప్పటివరకు ఇక్కడ అధ్యాపకుల నియామకం జరగలేదు. పైగా ఎక్కడా లేని విధంగా ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లో 65 మంది బాలికలు ఇంటర్‌లో చేరారు. వీరంతా అధ్యాపకులు వస్తారని నెలన్నర రోజులుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఇప్పటివరకు అధ్యాపకుల నియామకం చేపట్టలేదు. దీంతో విద్యార్థినుల్లో ఆందోళన నెలకొంది. ఇలాగైతే తమ భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల భారం మోయలేక ఇక్కడ చేరితే అసలు బోధనే జరగడం లేదంటూ నిట్టూర్చుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మేమంతా ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించాల్సిందేనంటూ విద్యార్థినులు ఆవేదన చెందారు.

గతంలో ప్రోత్సాహం

నార్తురాజుపాళెం అనేక గ్రామాలకు కూడలి కావడంతో వివిధ గ్రామాల నుంచి బాలికలు ఇక్కడ పెద్ద సంఖ్యలో చేరారు. ఆరంభంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా ఇంటర్ విద్యను ఎంతగానో ప్రోత్సహించారు. సొంత నిధులతో డిజిటల్ స్క్రీన్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఆ ఐదేళ్లు ఇంటర్ విద్య సజావుగా సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వంలో అమలైన వాటిపై చిన్న చూపు చూస్తోంది. పూర్తిగా మూసేయకుండా విద్యార్థులే కళాశాలను వదిలి వెళ్లేలాగా చేస్తోందని ఉపాధ్యాయులే ఆరోపిస్తున్నారు.



హైస్కూల్ ప్లస్‌లోని డిజిటల్ తరగతి గదులు

త్వరలో నియామకం చేస్తాం



ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లో 65 మంది విద్యార్థినులు చేరడం వాస్తవమే. ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకులు బదిలీపై వెళ్లడం వల్ల ఒకే అధ్యాపకుడు మిగిలారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నియమిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి హైస్కూల్‌లోని సబ్జెక్ట్ టీచర్లతో బోధన చేయిస్తూ నెట్టుకొస్తున్నాం.

– డి.ఓబులేసు, హెచ్‌ఎం, హైస్కూల్ ప్లస్, నార్తురాజుపాళెం

మత్స్య కళాశాల డీన్‌గా ధన్‌పాల్



ఉద్యోగోన్నతి పొందిన వారికి సత్కారం

ముత్తుకూరు(పొదలకూరు): స్థానిక మత్స్య కళాశాల అసోసియేట్ డీన్‌గా ధన్‌పాల్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న బాలసుబ్రహ్మణ్యం మత్స్య యూనివర్సిటీ విభాగంలో ఇక్కడే ఎఫ్ఆర్ఎం అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మాధవన్ తూర్పుగోదావరి జిల్లాలోని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్‌గా బదిలీపై వెళ్లారు. ఉద్యోగోన్నతి పొందిన ముగ్గుర్నీ కళాశాల సిబ్బంది సత్కరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు: ఇనమడుగు సబ్‌స్టేషన్ పరిధిలో ఇనమడుగు, జమ్మిపాళెం, లేగుంటపాడు, చెర్లోపాళెం గ్రామాలకు ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల సంక్షేమానికి కృషి

వెంకటాచలం: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్ద గల కమ్యూనిటీ హాల్లో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ తొలి విడత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

ముగిసిన ఐటీటీ వర్క్‌షాప్



కోవూరు: గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ' అంశంపై వారం రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కళాశాల డైరెక్టర్ జి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ కె.శ్రవణ్‌కుమార్ పాల్గొని, మాట్లాడారు. ఇండస్ట్రియల్ ఐఓటీ రంగంపై అవగాహన కోసం వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అధిక ఫీజులపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో విద్యార్థుల నుంచి అధిక ఫీజుల దోపిడీ, అక్రమాలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతుల్లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ముడుపులు తీసుకుని మిన్నకుంటున్నారని ఆరోపించారు. డీఈఓ పాఠశాలలను సందర్శించడం మానేసి ఏసీ గదికి పరిమితమయ్యారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మానిష్‌రెడ్డి, సుకుమార్, శ్యామ్, మదన్, వైభవ్, సూర్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలను తొలగించండి



అనుమతుల్లేని భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): పట్టణ ప్రణాళికా విభాగం అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న భవనాలను పిల్లర్ల దశలోనే గుర్తించి తొలగించాలని కమిషనర్ నందన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక 18వ డివిజన్ హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియా తదితర ప్రాంతాల్లో కమిషనర్ శనివారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అనుమతుల్లేకుండా నిర్మాణం జరుగుతున్న మూడు అపార్ట్‌మెంట్లను గుర్తించారు. భవన యజమానులను హెచ్చరించి నిర్మాణ పనులను నిలిపివేయించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో అనుమతులను మించి నిర్మాణాలు చేపడుతున్న మూడు భవనాలను గుర్తించి చార్జ్‌షీట్లు దాఖలు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండా భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. అనుమతుల్లేని ఫ్లెక్సీలను గుంజలతో సహా తొలగించేయాలని, అనధికార ప్రకటనపై ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి యజమానులకు అవగాహన కల్పించి క్రమబద్ధీకరణ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అశోక్ కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వివాదాలు సృష్టించడం తగదు



మాట్లాడుతున్న నాయకులు

కోవూరు: ఇరిగేషన్ అధికారులు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించడం తగదని సీపీఎం నేతలు అన్నారు. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఊస గురవయ్య ఎకరా పొలం సంబంధమై ఇరిగేషన్ అధికారులు శనివారం సర్వే చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో గ్రామస్తులు, నాయకులు వచ్చి అడ్డగించి, మాట్లాడారు. సర్వే నంబర్ 90లో మొత్తం భూమిని సర్వే చేయాల్సింది పోయి కేవలం గురవయ్య పొలం వద్ద మాత్రమే సర్వే జరగాలంటూ ఇరిగేషన్ ఏఈ రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం తగదన్నారు. ఒక రైతును మాత్రమే లక్ష్యంగా ఇబ్బందులు కలిగించడం ఎందుకని నిలదీశారు. కార్యక్రమంలో గండవరం శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, మోహన్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా ఇంటింటి సర్వే



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

- ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

కొడవలూరు: క్షయపై ఇంటింటి సర్వే సమగ్రంగా జరగాలని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. కొడవలూరు, యల్లాయపాళెం పీహెచ్‌సీలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమయపాలనపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. క్షయ సర్వేలో భాగంగా గుర్తించిన వారికి తగిన చికిత్స అందించాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరిలో అవగాహన పెంచాలన్నారు. అనంతరం పీహెచ్‌సీల పరిధిలో నమోదైన డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, కామాక్షయ్య, క్షయ పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, స్టాఫ్ నర్సులు సరస్వతి, వెన్నెల, ఎస్ఎన్‌లు పరిమళ, ఆదిలక్ష్మి, ఎస్టీఎస్ సత్యనారాయణ ఉన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్బీఐ విజయవాడ జనరల్ మేనేజర్ మహస్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో పొదుపు మహిళలు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద వార్షిక ప్రీమియం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా అందుతుందని వివరించారు. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షలు బీమా అందుతుందన్నారు. వీటిపై గ్రామ పంచాయతీ స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండవరంలో గ్రామసభ



కొడవలూరు: మండలంలోని గండవరం సచివాలయ ప్రాంగణంలో స్వామిత్వపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. స్వామిత్వ పథకం ద్వారా స్థిరాస్తులకు హక్కులు దక్కుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజకుమారి, ఉదయకోశ్వర ఆలయ మాజీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి, వీఆర్వో షరీఫ్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

పొదలకూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కొనగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే మంచిదన్నారు. అనంతరం చంటి పిల్లల తల్లులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఉపాధ్యాయుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: పిడతాపోలూరులో..

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పిడతాపోలూరు ఐసీడీఎస్ సెక్టార్ బ్రహ్మదేవం గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ రంగమ్మ, టీచర్లు నాగలక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు హరికుమారి, రాజేశ్వరి, సుమలత, అపర్ణ, భాగ్యలక్ష్మి, గీతాకుమారి, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు పంచాయతీ జానవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ లలితాంబ తదితరులు పాల్గొన్నారు.

ముర్రు పాలే బిడ్డకు తొలి టీకా

కొడవలూరు: ముర్రు పాలు బిడ్డకు తొలి టీకాగా ఉపకరిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి పాలనే పట్టించాలన్నారు. తద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనేక రకాల రోగాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం మహేశ్వరి, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆలూరుపాడులో..

మండలంలోని ఆలూరుపాడు మజరా రెడ్డిపాళెంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలను పట్టించడం శ్రేయస్కరమన్నారు.

కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, మంజుల, శీనమ్మ, సుస్మిత పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు: నరుకూరులో..



పొదలకూరు: తల్లులకు పౌష్టికాహారం అందజేత



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కొడవలూరు: రెడ్డిపాళెంలో..